## క్లుప్తంగా

### టేబుల్ టెన్నిస్‌లో ప్రతిభ



విద్యార్థి ఆమీనను అభినందిస్తున్న నారాయణ కళాశాల ప్రిన్సిపల్ వెంకటస్వామి

కడప ఎడ్యుకేషన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన టేబుల్ టెన్నిస్ అండర్–19 విభాగంలో కడప నారాయణ జూనియర్ కళాశాల సీనియర్ విద్యార్థి ఆల్ అమీన ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచారు. కళాశాల డీన్ చంద్రకిషోర్‌రెడ్డి, ప్రిన్సిపల్ వెంకటస్వామి, ఏజీఎం చెన్నకేశవరెడ్డి విద్యార్థిని అభినందించారు.

### 14 నుంచి రాష్ట్ర స్థాయి యోగా పోటీలు



క్రీడాకారులతో హెచ్‌ఎం, పీడీ

కడప స్పోర్ట్స్ : విశాఖపట్నంలోని భీమిలిలో ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు కడప నగరం చెమ్ముమియాపేట బాలురోన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. యోగ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలకు పాఠశాలకు చెందిన విష్ణు, బన్ని, మల్లికార్జునలు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు గిరిజ కుమారి, ఫిజికల్ డైరెక్టర్ ప్రవీణ్ కిరణ్ తెలిపారు.

### హుండీలో నగదు లెక్కింపు



శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయంలో హుండీ సొమ్మును లెక్కిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : కడప మున్సిపల్ మైదానంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయ హుండీలను బుధవారం లెక్కించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ లెక్కింపు జరిగింది. ఈ ఏడాది మార్చి 27 నుంచి నేటి వరకు రూ.1,25,272 లభించినట్లు శ్రీధర్ తెలిపారు.

**పాలకొండ్రాయునికి..**

కడప నగర శివారులోని పాలకొండ్రాయ స్వామి క్షేత్రంలో హుండీలు లెక్కించినట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డయ్య యాదవ్, ఈఓ శ్రీధర్, ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా నాలుగు శనివారాల్లో రూ.2,18,894 నగదు లభించిందని వారు పేర్కొన్నారు. విరాళాల ద్వారా రూ. 2,84,553, సేవా టిక్కెట్ల రూపంలో రూ.46,370 లభించాయని వివరించారు. కళ్యాణ చదివింపుల ద్వారా రూ.3978, పార్కింగ్ రుసుము ద్వారా రూ.21,000 కలిపి మొత్తం రూ.5,74,795 సొమ్ము ఆలయానికి సమకూరిందని తెలిపారు.

### ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

కడప కార్పొరేషన్ : ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని జై భీమ్ మాల మహాసేన అధ్యక్షుడు పల్లెకొండు సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి చైతన్య అన్నారు. కడపలో బుధవారం మాలల సమావేశం నిర్వహించి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేక నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో దేశంలో మాల, మాదిగల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడిందన్నారు. వర్గీకరణ, క్రిమీలేయర్‌తో మాలలు ఎక్కువగా నష్టపోతారని, రిజర్వేషన్లు పూర్తిగా తొలగించాలనే కుట్రతో ఇలా చేస్తున్నారని మండిపడ్డారు. న్యాయ పోరాటంతో వర్గీకరణను అడ్డుకుంటామని మాల ఉద్యోగులు, కార్మికులు విద్యార్థుల సహకారంతో ఉద్యమం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ మాల మహాసేన సభ్యుడు లావణ్య, వినోద్ కుమార్, శ్యాంసున్, బందెల రవి, శేఖర్, బల్లి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

### సాహితీ బాటలు వేసి కవి దువ్వూరి

కడప కల్చరల్ : కవి, రచయిత, విమర్శకులు కవి కోకిల దువ్వూరి రామిరెడ్డి కొత్తతరానికి సాహితీ బాటలు వేసిన కర్షక కవి అని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో బుధవారం దువ్వూరి వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ దువ్వూరి శైలి ప్రత్యేకమైందని, ఆయన కమనీయమైన ఈ కార్యక్రమంలో డాక్టర్ పాలెం వేణుగోపాల్, కల్లూరి బాలయల్లారెడ్డి, దేవరశెట్టి గంగయ్య, దాసరి సుధాకర్, ప్రకాశం, పట్నం సుబ్బరాయుడు, బాల ఓబయ్య, గంగయ్య పాల్గొన్నారు.

# కార్మికులకు ప్రత్యక్ష నరకం

- పాచిపోయిన ఆహారం పెట్టడంతో అనారోగ్యం
- కార్పొరేషన్ ఎదుట పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన
- అందరినీ వెనక్కి రప్పిస్తామని మేయర్ హామీ



కార్మిక నాయకులతో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : విజయవాడ వరద బాధితులకు అండగా ఉండాలని, అక్కడ పరిశుభ్రతా చర్యలు చేపట్టేందుకు వెళ్లిన మున్సిపల్ కార్మికులకు ప్రత్యక్ష నరకం కనబడుతోంది. కార్మికులు నిత్యం పని చేస్తున్నా వారికి సరైన ఆహారం అందడం లేదు. వరద నీటిలో పనిచేయడంతో చాలామంది కాళ్లకు బొబ్బలు వచ్చాయి. ఆహారం పడక చాలామంది కడుపు నొప్పి, విరేచనాలతో బాధ పడుతున్నారు. వారిని వెంటనే వెనక్కి రప్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నగర కార్యదర్శి సుబ్బయ్య, నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి, మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షుడు సుంకరి రవి ఆధ్వర్యంలో బుధవారం కడప కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదలో మునిగిన విజయవాడను శుద్ధి చేసేందుకు కడప నగరపాలక సంస్థ కార్మికులను విజయవాడకు రప్పించి, అక్కడ వారికి కనీస వసతులైన నీరు, ఆహారం, మరుగు దొడ్లు మరియు వసతి గృహాలు ఏర్పాటు చేయకుండా రాత్రింబవళ్లు పని చేయిస్తున్నారన్నారు. పాచిపోయిన అన్నం పెట్టి కార్మికులందరినీ అస్వస్థతకు గురిచేశారన్నారు. వారి చర్యలతో వరద బాధితులకు సహాయం చేయాలని పోయిన మున్సిపల్ కార్మికులే బాధితులుగా మారే పరిస్థితి కనిపిస్తోందన్నారు. కొంతమందికి చేతులు ఇన్ఫెక్షన్ అయి బొబ్బలు కట్టాయని, మరికొందరు తీవ్ర జ్వరంతో, కడుపు నొప్పితో ఇబ్బంది పడుతున్నారన్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి విజయవాడ క్యాంపు వెళ్లిన కార్మికులందరినీ తిరిగి కడపకు రప్పించాలని, వారికి పూర్తి స్థాయి వైద్యం అందించాలని కోరారు. ధర్నా కార్యక్రమం వద్దకు నగర మేయర్ సురేష్ బాబు వెళ్లి కార్మిక నాయకులతో మాట్లాడారు. కార్మికులకు నగర పాలక సంస్థ నిధులతో వైద్యం చేయించాలని, వారిని దుర్భాషలాడిన శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రన్‌ను ఆదేశించారు. విజయవాడ వెళ్లిన వారిని వెనక్కు పిలిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మల్లికార్జున, 9వ డివిజన్ ఇన్‌చార్జి కిరణ్, మున్సిపల్ కార్మికులు నాగరాజు, సి.పి అరుణ్, చెన్నయ్య, నారాయణ, రవి, సంతోషమ్మ పాల్గొన్నారు.



విజయవాడలో కార్మికులకు పెట్టిన పాడైన అన్నం

# ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నేతలు



రిలే దీక్షలు చేపట్టిన ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సుదీర్ఘకాలంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ విధులు నిర్వర్తిస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. రీజినల్ కమిటీ పిలుపు మేరకు బుధవారం కడపలోని ఆర్ఎం కార్యాలయం వద్ద ఒక రోజు రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎనిమిది నెలలుగా ఉద్యోగుల సమస్యల గురించి డీపీటీఓకు పలుమార్లు విన్నవించినా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. అన్ని డిపోలలో నైట్ అలవెన్సులను చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న కడప, మైదుకూరు, బద్వేలు నూతన కండక్టర్ల, డ్రైవర్ల ఫిక్స్‌డ్ చార్టులను వేయాలని, 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, ఉద్యోగులను వేధిస్తున్న జమ్మలమడుగు డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని, అర్హత మేరకు మహిళలకు చైల్డ్ కేర్ లీవులు మంజూరు చేయాలని తదితర డిమాండ్ల సాధనకు దీక్షలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు పీవీ శివారెడ్డి, నాగమణి, శ్రీనివాసులు, జయరాం, పీఎస్ ఖాన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక వ్యవహారాలపై అవగాహన



మాట్లాడుతున్న మధుసూదనరావు

వైవీయూ : జాతీయ బ్యాంకులు అందించే విద్యా రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కడప ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ అకౌంట్స్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ సి.మధుసూదనరావు అన్నారు. కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బ్యాంకులు, ఆర్థిక వ్యవహారాలు అంశంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులు అందించే సదుపాయాల గురించి తెలుసుకోవాలని సూచించారు. డిప్యూటీ మేనేజర్ అనూరాధ, సీనియర్ అసోసియేట్ రాజశేఖర్ మాట్లాడుతూ బ్యాంకింగ్ సమయంలో మొబైల్‌లో వచ్చే అనవసర యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.వి.సలీంబాషా, వైస్ ప్రిన్సిపల్ శ్రీరామరెడ్డి, ఖాజామోహిద్దీన్, ప్రకాష్ నారాయణరెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

■ కళాశాలలో గత కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న స్టూడెంట్ ఇండక్షన్ కార్యక్రమంలో బుధవారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. కదిరి ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు డా.సుందరమోహన్‌రెడ్డి విచ్చేసి వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలపై మాట్లాడారు.

### గండికోట ఉత్సవాల లోగో గడువు పెంపు

కడప కల్చరల్ : గండికోటలో త్వరలో నిర్వహించనున్న పర్యాటక ఉత్సవాల లోగో చిత్రించే గడువును ఈ నెల 22వ తేదీ వరకు పొడిగించారని ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి తెలిపారు. తొలి విడతగా పది లోగోలు పరిశీలనకు వచ్చాయన్నారు. మరింత ఎక్కువ సంఖ్యలో లోగోలు వచ్చేందుకు అవకాశం ఉన్నందున గడువు మరిన్ని రోజులు పెంచాలని ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన కలెక్టర్ శివశంకర్ లోతేటిని అభ్యర్థించారు. స్పందించిన కలెక్టర్ ఈనెల 22వ తేది వరకు లోగోలు పంపేందుకు గడువును పొడిగిస్తున్నామని తెలిపారు. పర్యాటకులకు ఆ ప్రాంత వివరాలను తెలుపుతూ ఇంటాక్ కడప చాప్టర్ ద్వారా 10 వేల కరపత్రాలను ముద్రించి ఉచితంగా అందజేస్తామని ఇంటాక్ కన్వీనర్ చిన్నపరెడ్డి తెలిపారు.

### నేడు ఆడిటర్ల నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల ఆడిటర్ల నూతన కమిటీ ప్రమాణ స్వీకారం గురువారం నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి రావులూరు జయకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. 2024 – 26 కాలానికి నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేస్తుందన్నారు.. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీటీపీసీఏ రాష్ట్ర అధ్యక్షుడు దామచర్ల శ్రీనివాసరావు, రాష్ట్ర ముఖ్య సలహాదారు పఠాన్ షరీఫ్ ఖాన్, జిల్లాలోని జీఎస్టీ అధికారులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా అతిథులు, జిల్లా అధికారులు ఆడిటర్లకు టాలీ సాఫ్ట్‌వేర్, జీఎస్టీ, ఇన్‌కమ్ టాక్స్ వంటి విషయాలపైనా అవగాహన, సందేహాల నివృత్తి చేస్తారన్నారు.

### 'వరద' బాధితులకు సహాయం

కడప సెవెన్‌రోడ్స్ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం జిల్లా సర్వే, భూమి రికార్డుల శాఖ ఉద్యోగులు రూ. 45 వేలు విరాళంగా ప్రకటించారు. ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.మురళీకృష్ణ, ఇతర సిబ్బంది బుధవారం సంబంధిత చెక్కును కలెక్టర్ శివశంకర్‌కు అందజేశారు.

**విరాళాల సేకరణ**



విరాళాల సేకరణ చేపట్టిన సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విజయవాడలో బుడమేరు వరదలతో నష్టపోయిన ప్రజల సహాయార్థం సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు కేసీ బాదుల్లా, జిల్లా సమితి సభ్యులు సావంత్ సుధాకర్ తదితరులు విరాళాల సేకరణ చేపట్టారు. గాలి చంద్ర మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పెద్ద ఎత్తున ప్రాణ నష్టాలు జరుగుతాయని, అలాంటి సందర్భంలోనే ప్రజలు పెద్ద ఎత్తున సహాయ సహకారాలు అందించి బాధితులకు అండగా నిలబడాలన్నారు. కులమత ప్రాంత రాజకీయాలకతీతంగా వరద బాధితులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఆయన కోరారు.

# గ్రామీణ ప్రాంతాల్లో మానవ హక్కులపై అవగాహన



నాలుగో వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న కాసల కోనయ్య

కడప కార్పొరేషన్ : మానవ హక్కులపై ప్రజల్లో విస్తృత ప్రచారం జరిపి, వారి హక్కులు సద్వినియోగం చేసుకొనేలా సదస్సులు నిర్వహించనున్నామని ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం జాతీయ చైర్మన్ కాసల కోనయ్య స్పష్టం చేశారు. ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం (గ్రా) వార్షికోత్సవ వేడుకలు కడప జిల్లా కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా చైర్మన్ లోకేష్ ఆధ్వర్యంలో జాతీయ చైర్మన్ కేక్ కటింగ్ చేసి సభ్యులకు పంచి పెట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ చైర్మన్ కాసల కోనయ్య మాట్లాడుతూ దేశంలోనేగాక, ప్రపంచంలో ఎన్నో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మానవ హక్కులపై చైతన్యం చేసి ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాశం రవికుమార్, జి.రాఘవ, రామకృష్ణ, సుబ్బరామయ్య, శిల్పారెడ్డి, జాకీర్, గౌస్, ఇర్షాద్, చెన్నకేశవులు, శ్రీనివాసులు, బాలకృష్ణ చంద్ర ఓబులయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలి



డీఈఓ కార్యాలయ ఏడీకి వినతి పత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని ప్లస్ టు ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు కోరారు. డీఈవో కార్యాలయ పరిపాలనాధికారి మునీర్ ఖాన్‌కు బుధవారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉండరాదన్నారు. ప్లస్ టు ఉన్నత పాఠశాలలో ఖాళీలతోపాటు, ఉన్నత పాఠశాలల్లో దీర్ఘకాలిక సెలవుపై ఉన్న ఉపాధ్యాయుల స్థానంలో మిగులు ఉపాధ్యాయులను పని సర్దుబాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, ఏజాస్ అహమ్మద్, ప్రభాకర్, బత్తుల చంద్రశేఖర్, సుబ్బారావు, యడాల సురేష్ కుమార్, ములపాకు నాగిరెడ్డి, ఎంవీఎస్ రాజు, సూర్య ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# అద్దె చెల్లించిన వారికి రసీదులు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరి రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప రైతు బజారులో గత ఆరు నెలలుగా అద్దె కడుతున్నా.. మార్కెటింగ్ శాఖ అధికారులు రసీదులు ఇవ్వడం లేదని ఏపీ రైతు సంఘం కడప జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి తెలిపారు. రైతు సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కిరాణా షాపులు, ఎర్రగడ్డలు బంగాళ దుంపలు, కూరగాయలమ్మే వారికి కడప రైతు బజారులో రూముకు రూ.3500 నుంచి రూ.6000 వరకు వసూలు చేస్తున్నారన్నారు. ప్రతి నెలా దాదాపు రూ.2లక్షల వరకు అద్దె రూపంలో వస్తున్నా.. రసీదులు ఇవ్వడం లేదన్నారు. నగదు రూపంలో కాకుండా బ్యాంకు అకౌంట్లో బాడుగ చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులను అగౌరవపరచలేదు



సూపరింటెండెంట్ సురేష్ రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న డీఈఓ కార్యాలయ నాన్ టీచింగ్ సిబ్బంది

కడప ఎడ్యుకేషన్ : విద్యా శాఖ కార్యాలయానికి వచ్చే ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నేతల పట్ల ఏనాడూ తమ కార్యాలయ సిబ్బంది అగౌరవంగా వ్యవహరించలేదని డీఈఓ కార్యాలయ నాన్ టీచింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి సాయి ఫణేంద్ర తెలిపారు. ఆర్‌జేడీ కార్యాలయ సూపరింటెండెంట్ సురేష్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 4న డీఈఓ కార్యాలయంలో ఓ ఉపాధ్యాయుడికి సంబంధించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దరఖాస్తు విషయమై ఎస్‌టీఎఫ్ నాయకులు అసభ్య పదజాలంతో వ్యవహరించారన్నారు. ఈ విషయమై డీఈఓకు ఫిర్యాదు చేశామన్నారు. విచారణాధికారిని నియమించి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ క్యాంపు క్లర్క్ ప్రవీణ్, డిప్యూటీ డీఈఓ కార్యాలయ క్యాంపు క్లర్క్ కృష్ణారెడ్డి, డీఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అండర్‌-14 క్రికెట్ ఎంపికలకు విశేష స్పందన



ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్–14 క్రికెట్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 250 మంది క్రీడాకారులు ఎంపికలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ మాట్లాడుతూ ఎంపికలు ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హాజరైన క్రీడాకారుల నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ప్రాబబుల్స్‌కు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఈనెల 13 నుంచి సెలక్షన్ మ్యాచ్‌లు నిర్వహించి జిల్లా జట్టును ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించి 90 మంది క్రీడాకారులను ప్రాబబుల్స్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీఏవైడీ ప్రతినిధులు ఖాజామైనుద్దీన్, మునికుమార్‌రెడ్డి, నాగభూషణం, విష్ణుమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**నిబంధనల ప్రకారమే ఎంపికలు**

కడప స్పోర్ట్స్ : క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) పరిధిలో నిర్వహించే క్రికెట్ ఎంపికలు అన్నీ బీసీసీఐ, ఏసీఏ నిబంధనలు అనుసరించే నిర్వహిస్తున్నట్లు సీఏవైడీ జిల్లా కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. ఇటీవల కాలంలో సీఏవైడీ ఎంపికలపై పలు కథనాలు మాధ్యమాల్లో రావడంతో దీనిపై ఆయన స్పందించారు. బీసీసీఐ/ఏసీఏ నిబంధనలు అనుసరించి ప్రతియేటా అండర్–14, 16, 19, 23, సీనియర్స్ విభాగాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విభాగం ఎంపికలకు రాష్ట్రస్థాయి క్రీడాకారులు, అసోసియేషన్ సభ్యులతో కలిసి ముగ్గురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేసి సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికల విషయంలో వయసుకు సంబంధించి బర్త్ సర్టిఫికెట్, రెసిడెన్స్‌కు సంబంధించి ఆధార్‌కార్డు/ఓటరుకార్డు, పాస్‌పోర్టులలో ఏదైనా ఒకదాన్ని పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. మూడు సంవత్సరాల స్టడీ సర్టిఫికెట్, పదోతరగతి మార్కులిస్టు తీసుకువచ్చిన వారినే ఎంపికలకు అనుమతిస్తున్నామని తెలిపారు. ధ్రువీకరణ పత్రాలను సరిచూసి అర్హులను మాత్రమే జిల్లా జట్టుకు ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. తప్పుగా ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు ఆరోపణలు వస్తే వారిపై కమిటీ వేసి నిజనిర్ధారణ చేస్తామన్నారు.

# ఇంటర్ కళాశాలలపై విచారణ జరపాలి



ఆర్‌జేడీకి వినతి పత్రం సమర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ జిల్లాల్లో ల్యాబ్ సౌకర్యం లేని ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. బుధవారం ఇంటర్ విద్య ఆర్‌జేడీ రవిని కడప కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నా, ల్యాబ్ సౌకర్యం కల్పించడం లేదన్నారు. కళాశాలలను ఆకస్మిక తనిఖీ చేయాలని ఆయా జిల్లాల ఆర్ఐవోలను ఆదేశించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్, నాయకులు మనోజ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

కమలాపురం : గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీలు అందించే పౌష్టికాహారాన్ని తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షంషాద్‌బేగం తెలిపారు. బుధవారం కమలాపురం సెక్టార్‌లోని 7వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో 1వ వార్డు సచివాలయంకు సంబంధించిన అంగన్‌వాడీ వర్కర్లు పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు కలిగిన ఆకుకూరలు, కూరగాయలు తదితర వాటితో లోగో చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనతను నివారించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తోందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు రాణి, లక్ష్మీదేవి, కిరణ్ కుమారి, గౌసియా, ఎలిజబెత్ రాణి, వైష్ణవి, క్రిష్ణవే ణి, గర్భిణులు పాల్గొన్నారు.

# ఘనంగా గణపతి నిమజ్జనం



రాజీవ్ మార్గ్‌లో క్రేన్ ద్వారా లారీపైకి చేర్చుతూ..



మారుతీనగర్‌లో వినాయక విగ్రహం వద్ద యువతీ, యువకుల కోలాహలం

కడప కల్చరల్ : ఆది పూజల దేవుడు గణపతి నిమజ్జనం ఐదో రోజున బుధవారం ఘనంగా కొనసాగింది. శనివారం ప్రతిష్ఠించిన విగ్రహాలను సంప్రదాయంగా మూడవరోజున నిమజ్జనం చేశారు. మరిన్ని చోట్ల ఐదు రోజులకు, ఇంకొన్ని చోట్ల ఏడు రోజులకు కూడా నిమజ్జనాలు చేయనున్నారు. ఇందులో భాగంగా ఐదో రోజు బుధవారం కడప నగరంలో నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. 1, 2 భారీ విగ్రహాలు మినహా ఓ మోస్తరు నుంచి పెద్ద విగ్రహాల వరకు నిమజ్జనానికి తరలించారు. కడప నగరంలోనూ, ఊరి వెలుపలగల కేసీ కెనాల్‌లోనూ, కుంటలు, చెన్నూరు, సిద్దవటం పెన్నానదిలోనూ ఎక్కువ శాతం పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేశారు. నగరానికి చెందిన ఎక్కువ విగ్రహాలను పాత కడప చెరువుకు తరలించారు. పోలీసులు, మున్సిపల్ సిబ్బంది పకడ్బందీ చర్యలు చేపట్టడంతో నిమజ్జనాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. యువత ఉత్సాహంగా ట్రాక్టర్లు, పెద్ద లారీలలో విగ్రహాలను తరలించారు. ఉత్సాహభరితంగా రంగులు చల్లుకుంటూ కేరింతలతో నృత్యాలు చేస్తూ నిమజ్జన ఊరేగింపులో యువత పాల్గొన్నారు.

నగరంలో పెద్ద విగ్రహాలలో ఒకటైన రాజీవ్ మార్గ్‌లోని గణపతి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. తొలుత స్థానిక ప్రముఖులు వంశీనాథరెడ్డి ఆధ్వర్యంలో స్వామి లడ్డూను లాటరీ ద్వారా కె.సుదర్శన్‌రెడ్డి దక్కించుకున్నారు. మిగతాచోట వలనే మధ్యాహ్నం భారీగా అన్నదానం చేశారు. నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో భారీ క్రేన్ ద్వారా వినాయక విగ్రహాన్ని లారీపై ఎక్కించి భారీ భక్తజన సందోహం మధ్య నిమజ్జనానికి తరలించారు. భక్తుల కోలాటాలు, భజనలు ఊరేగింపుగా సాగారు.



కడప గడప ఆలయం సమీపంలోని చెరువు వద్ద గణేశ్ విగ్రహ నిమజ్జనం



అక్కాయపల్లి సమీపంలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

### 15 నుంచి ఉత్సవాలు

కడప కల్చరల్ : తిరుమలకు తొలిగడపగా పేరున్న దేవునికడప శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి దోష పరిహార ఉత్సవాలు జరగనున్నాయి. ఏడాది పాటు ఆలయంలో పూజోత్సవాల సందర్భంగా జరిగిన దోషాల పరిహారం కోసం ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 15న తొలి రోజున ఆదివారం అంకురార్పణ, పవిత్రాల ప్రతిష్ఠ, 16న సమర్పణ, 17న ముగింపు ఉత్సవాలు నిర్వహించనున్నారు.

### ఉమ్రా యాత్ర పవిత్రం

కడప కల్చరల్ : మహా ప్రవక్త మహమ్మద్ (సొ.అ.వ) జన్మించిన మాసంలో ఉమ్రా యాత్ర నిర్వహించడం పవిత్రమైదని మత గురువు మౌలానా సయ్యద్ నిజాముద్దీన్ బుఖారి తెలిపారు. పవిత్రమైన ఉమ్రా యాత్రకు బుధవారం ముస్లింలు బయలుదేరారు. ఈ సందర్భంగా మౌలానా సయ్యద్ నిజాముద్దీన్ బుఖారి మాట్లాడుతూ పవిత్రమైన మిలాదున్ నబీ మాసంలో ఉమ్రా యాత్ర చేయడం ఎంతో అదృష్టంగా భావించాలన్నారు. అవకాశం ఉన్న ప్రతి ముస్లిం హజ్, ఉమ్రా యాత్ర చేయాలన్నారు. పవిత్ర యాత్రలో విజయవాడలోని వరద బాధితులు త్వరగా కోలుకోవాలని ప్రత్యేకంగా ప్రార్థిస్తామని తెలిపారు. డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం, జమాల్ వలి పాల్గొన్నారు.